స్వరూపమును పొందలేరు. నన్ను ఎలా బ్రతకమంటారు అని భగవాన్‌ను అడిగితే చచ్చినవాడిలా బ్రతుకు అనేవారు భగవాన్. అంటే నీ దేహం ఉండాలి నీవు చనిపోవాలి. అప్పడు నీవు జ్ఞానివి అవుతావు. భగవాన్ బోధకు, ఉపనిషత్‌ల బోధకు తేడా ఏమిటి అంటే రెండు ఖాళీ డబ్బాలు తీసుకొని ఒకదానిలో ఒకకాసు బంగారం వెయ్యిండి. రెండో డబ్బాలో బంగారంతో పాటు కొన్ని రాళ్ళు వేయండి. రెండింటిలోనూ బంగారం ఉంది కాని రాళ్ళు లేని డబ్బాలో చెయ్యిపెట్టి బంగారాన్ని వెంటనే తీసుకోవచ్చు. భగవాన్ బోధ ఇలా ఉంటుంది. రాళ్ళు ఉన్న డబ్బాలో కూడా బంగారం ఉన్నా చెయ్యి పెట్టి రాళ్ళను గెంటుకొని గెంటుకొని బంగారాన్ని తీసుకోవాలి. ఉపనిషత్‌ల బోధ ఇలా ఉంటుంది అని చలంగారు చెప్పారు.

(జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 11-10-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రాగం వలన, ద్వేషం వలన, భయం వలన, కోపం వలన మనకు దుఃఖం వస్తుంది. ఏకారణములవలన మానవుడికి దుఃఖం వస్తుందో ఆకారణములను విడిచిపెట్టమని భగవంతుడు చెప్పాడు. మమకారం వేరు, ప్రేమవేరు. మమకారాన్ని మనం ప్రేమ అనుకొంటున్నాము. మనకు మమకారం ఉందిగాని ప్రేమలేదు. ఒక్క జ్ఞానికి తప్పించి అందరికి ఏదోభయం ఉంటుంది. భయాలు చాలా ఉన్నాయి కాని అన్నింటికంటే మరణ భయం పెద్దది. మనం చిరకాలం జీవించాలని అనుకోకూడదు, తొందరగా మరణించాలని అనుకోకూడదు. ఇది మనస్సులో ఉన్నదోషం. అలాగ అనుకోకూడదు, ఇలాగ అనుకోకూడదు ఈశ్వర నిర్ణయానికి విడిచిపెట్టాలి. భగవంతుని మీద భారంవేసి జీవించేవాడికి మిగతాభయాలు తగ్గుతాయి, మరణభయం కూడా తగ్గుతుంది. భగవంతుని మీద భారంవేసి జీవించేవాడికి జ్ఞానం కలుగుతుంది. శరీరంలో చాలా అవయవాలు ఉన్నాయి. అన్నింటిని జ్ఞానం సంపాదించటానికి ఉపయోగించుకొంటే జ్ఞానం కలుగుతుంది. మనిషి ఎన్నో కష్టాలు, బాధలు అనుభవిస్తేకాని వినయం, వివేకం, విచక్షణరాదు. మనకు తెలివి, ధనం, చదువు ఉన్నంతమాత్రం చేత వినయం విచక్షణరాదు. నీరు పల్లానికి ఎలా వెళుతుందో అలాగ వినయం ఉన్నచోటికి జ్ఞానం వెళుతుంది. మాట అణగనివాడు, మనస్సు అణగనివాడు చెప్పినది వింటే అది శ్రవణం కాదు, ఆత్మానుభవం పొందినవాడు చెప్పేది మీరు వింటే అది శ్రవణం అవుతుంది.

గాఢనిద్రలో నేను ఉందికాని నేను అనే తలంపు లేదు. గాఢనిద్రలో ఉన్న నేనుకు పరిమితులు లేవు. అది నిజమైననేను. నేను అనే తలంపు దేహానికి పరిమితమై దేహంతో తాదాప్యం పొంది ఉంటుంది. భౌతికమైన దేహం అగ్నికి ఆహుతి అవ్వకముందే దేహానికి పరిమితమైన నేనును ఎవడైతే తొలగించుకొంటాడో వాడు జన్మలేని స్థితిని పొందుతాడు. మనం జాగ్రదావస్థలోనికి వచ్చేటప్పటికి నేను అనే తలంపువస్తుంది. ఇది గాఢనిద్రలో ఉన్న నేనులో నుండే వస్తోంది. జాగ్రదావస్థలో సాధనచేసి ఈనేను అనే తలంపును పోగొట్టుకొంటే గాఢనిద్రలో ఉన్న నిజమైన నేను నీకు జాగ్రదావస్థలో వ్యక్తమవుతుంది. అదే చివరస్థితి, అదే స్వర్గరాజ్యం, అదేనిర్వాణస్థితి. ఇప్పడు దేహం నేను అనే తలంపు మనకు ఎలా వస్తోందో అలాగ ఆత్మ నేను అనే తలంపు అనుభవంలోనికి వచ్చేవరకు దాని తాలుకా ఆనందం, సుఖం నీవు పొందలేవు. ఆత్మానందం కలిగేవరకూ జననమరణచక్రంలో నుండి బయటకు

రాలేవు. చనిపోయినవారు పుడతారు, పుట్టిన వారు చనిపోతారు. నీహృదయంలో ఉన్న ఆనందం, శాంతి నీకు అందేవరకు ఈ చక్రంలో తిరుగుతూ ఉంటావు. కోటిజన్మలు ఎత్తినా బయటకు రాలేవు. ఎందుకు బయటకు రాలేవు అంటే ఆత్మానందం నీకు అందేవరకూ చిల్లర సుఖాలను, చిల్లర విషయాలను నీమనస్సు కోరుతూఉంటుంది. నీవు దేహం లేకుండా చిల్లర సుఖాలను ఎలా అనుభవిస్తావు. మీకు భోగం మీద దృష్టి ఉన్నంత కాలం దేహం వస్తుంది ఎందుచేతనంటే దేహం లేకుండా భోగం అనుభవించలేడు. దేహంతో సంబంధం లేని ఆనందం అంటే ఆత్మానందం అనుభవంలోనికివస్తే అప్పుడు నీకుదేహంతో పని ఉండదు కాబట్టి దేహం రాదు. మనకు జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషిప్తి అని మూడు అవస్థలు ఉన్నాయి. ఈమూడు అవస్థలలో ఆత్మ సమానంగా ఉంది. ఈ మూడు అవస్థలలో సమానంగా ఉన్న ఆత్మను ఎవడైతే అనుభవంలోనికి తెచ్చుకొన్నాడో వాడు తురీయస్థితిని పొందాడు అంటారు. దానిని ఎవరూ నోటితో చెప్పలేరు.

ఒకదేహంతోటి, ఒకరూపంతోటి, ఒకనామంతోటి తాదాష్యం పొందుతున్నంతకాలం అహంభావన నశించే అవకాశంలేదు. నీకు పరిమితులు వస్తాయి. నామరూపములనుండి విడుదల పొందితే గాని మీరు దుఃఖం నుండి బయటకు రాలేరు. బయట ఉన్న భర్తలు మాయ భర్తలు, నీలోపలున్న సత్యవస్తువే నిజమైన భర్త అంది మీరాభాయి. పతి ఒక్కడే వాడే ఈశ్వరుడు. నామరూపముల చుట్టూ తిరుగుతున్న మనస్సుకు అంతర్దృష్టి కలుగజేయాలి. శాస్త్రాన్ని శ్రద్ధగా శ్రవణం చేస్తే, మహాత్ముల మాటలు వింటే అంతర్దృష్టి కలుగుతుంది. మీకు ఎప్పుడైనా దుఃఖం వస్తే భగవంతుడు కారణం అనుకోవద్దు. ఆయన పవిత్రుడు, పరిశుద్ధుడు. మీకు దుఃఖం తీసుకొనిరావాలి అని ఆయన అనుకోడు. మీరు పూర్వజన్మలో దేహబుద్ధితో చేసిన చెడ్డపనులే మీకు దుఃఖంగా వస్తున్నాయి, మంచిపనులే సుఖంగా వస్తున్నాయి. మీరు చేసిన పనులే మిమ్మల్ని వెంటాడుతున్నాయిగాని దేవునికి ఏమీ సంబంధంలేదు. ఆయనను ప్రార్థిస్తే దుఃఖకారణములు తీసేస్తాడు. నీఅలవాట్లు సరిగాలేకపోతే, నీప్రవర్తన సరిగా లేకపోతే అవే నీకు దుఃఖమును తీసుకొని వస్తాయి. పోజిటివ్‌గా ఉండటం నేర్చుకొంటే దుఃఖంలో నుండి బయటపడతావు. ఏదైతే సత్యవస్తువో దేనిగామనం ఉన్నామో దానిలోనుండి, ఐక్యభావనలో నుండి వేరుపడటం మానవుడు చేసిన పొరపాటు. అసలు వస్తువునుండి వేరుపడటమే మనం చేసిన పొరపాటు. దానివలన అనేక పొరపాట్లు రావచ్చును. మీరు నిరంతరము భగవంతుని స్మరణలో ఉంటే, భగవంతుని కేంద్రంగా పెట్టుకొని జీవిస్తే అహంభావన నశిస్తుంది. ఎవరైనా మీకు అనుకూలంగా ప్రవర్తించినా, వ్యతిరేఖంగా ప్రవర్తించినా భగవంతుడే అలాచేస్తున్నాడు అనుకొంటే మీకు హెచ్చుతగ్గులు పోతాయి. మనస్సులో ఉన్న వంకరలు పోతాయి. ఎవరైనా విమర్శించినా, స్తోత్రం చేసినా చేయించేది భగవంతుడే అని భగవంతుని స్మరణలో ఉంటే అహంభావన దాని అంతట అదే రాలిపోతుంది. ఎవడిమనస్సు అయితే అణిగిందో వాడిలో నుండి వచ్చే వాక్కు చల్లగా ఉంటుంది, దానికి శక్తి ఉంటుంది. మనస్సు అణగకపోతే వాడిలో నుండి వచ్చే వాక్కు చల్లగా ఉండదు. పవిత్రంగా ఉండదు, మీహృద యంలో ప్రవేశించలేదు. మాటలో శక్తి లేకపోతే, పవిత్రత లేకపోతే అది మీహృదయంలో ప్రవేశించి మీ జీవితంలో మార్పు తీసుకొనిరాలేదు. మీద్వారా ఏది జరిగినా భగవంతుడే పనిచేస్తున్నాడు అనుకొంటే మీకు భగవదనుభవం కలుగుతుంది.